క్లుప్తంగా

కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు



అయిజ: గ్రామాల్లో, పట్టణాల్లోని కార్యకర్తలే బీజేపీకి పట్టుగొమ్మలని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కంపాటి భగత్‌రెడ్డిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్ కుమార్, వెంకటేష్, లక్ష్మణాచారి, మధు, రామకృష్ణ, ఇబ్రహీం, రాఘవేందర్ రెడ్డి, అంజి పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నవంబరు నెల మొదటి ఆదివారం కావడంతో బల్లారాధన చేపట్టారు. మండల కేంద్రంలోని ఎంబీ షాలేం మందిరంతో పాటు హోసన్నా, మరనాథ విశ్వాస సమాజ మందిరం, కల్వరి చర్చిల్లో ప్రత్యేక ఆరాధన చేశారు. ప్రతి ఒక్కరు తమ పాప ములను దేవుని ఎదుట ఒప్పుకుని మంచి మార్గంలో నడవాలని ఎంబీ చర్చి పాస్టర్ సీపీ యూధా ప్రసాద్ సూచించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

మహాసభను విజయవంతం చేయండి



అయిజ: మహబూబ్‌నగర్‌లో ఈనెల 27న నిర్వహించనున్న మాదిగల ధర్మయుద్ధం మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాదిగల ధర్మయుద్ధం మహాసభకు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ప్రభాకర్, హనుమంతు, మారెన్న, రాజు, దేవరాజు, కల్యాణ్, రమేష్ బాబు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆర్థిక చేయూత



గద్వాలటౌన్: పీఆర్‌టీయూలో సభ్యత్వం పొందిన ఉపాధ్యాయుడు వీరశేఖర్ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు ఆదివారం పీఆర్‌టీయూ నాయకులు రాష్ట్ర శాఖ తరుపున ఆర్థిక సాయం అందించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కును అందజేశారు. పీఆర్‌టీయూలో క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడం వరమన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు సాధించడంలోనే కాకుండా, ఉపాధ్యాయుల బాధ్యతను సైతం పీఆర్‌టీయూ తీసుకుని పనిచేస్తుందన్నారు. ఉపాధ్యాయుడు వీరశేఖర్ మన మధ్య లేకున్నా, సంఘం వారి కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చిందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు వేణుగోపాల్, నరసింహారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, తరిటి నాయుడు, చంద్రశేఖర్, గోవిందు, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



నందిని

గట్టు: బాలిక అదృశ్యమైన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన భీమేష్‌కు నలుగురు అమ్మాయిలు. మూడో కూతురు నందిని ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. ఉదయం 9గంటలకు బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులతో, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. బాలిక వివరాలు తెలిసినవారు 8712670294కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ విజ్ఞప్తి చేశారు.

మరమ్మతుకు నోచుకోని రహదారి



మరమ్మతులకు నోచుకోని అయిజ-ఎక్లాస్‌పురం రోడ్డు

- శిథిలమైన అయిజ-ఎక్లాస్‌పురం రోడ్డు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

అయిజ: రెండు మండలాల మధ్య రాకపోకలు నిర్వహించేందుకు గతంలో అయిజ మండల కేంద్రం నుంచి గట్టు మండల కేంద్రానికి నిర్మించిన బీటీ రోడ్డు శిథిలమైంది. రోడ్డు శిథిలమై సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. రెండేళ్ల క్రితం రూ.1.20 కోట్ల నిధులతో గట్టు మండల కేంద్రంతో పాటు గొర్లఖాన్‌దొడ్డిలో సీసీ రోడ్ల నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. అదే నిధులతో అయిజ నుంచి ఎక్లాస్‌పురం వరకు బీటీరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తయినా, బీటీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేయకపోవడంతో గట్టు, అయిజ మండలాల్లోని గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

సగంలో నిలిచిపోయిన పనులు..

గట్టు, అయిజ మండలాల మధ్య రోడ్డుపై ప్యాచ్ వర్క్ చేసేందుకు ఏడాది క్రితం రోడ్డుపై శిథిలాలను తొలగించి కంకర పరిచారు. ఇంతవరకు పనులు పూర్తి చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలు కంకరపై అదుపుతప్పి కిందపడుతున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం..

అయిజ-ఎక్లాస్‌పురం రోడ్డు శిథిలం కావడంతో రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు ప్యాచ్ వర్క్ చేయిస్తున్నాం. యేడాది క్రితం పనులు ప్రారంభించాం. శిథిలమైన రోడ్డుపై కాంట్రాక్టర్ కంకర వేయించారు. బీటీ పనులు పూర్తిచేయాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయి. త్వరలో పనులు పూర్తి చేసేందుకు కృషిచేస్తాం.

– మహేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ

శిథిలమై సంవత్సరమైంది..



అయిజ నుంచి గట్టు మండలానికి ఏర్పాటు చేసిన బీటీ రోడ్డుకు శిథిలమై మరమ్మతులు చేపట్టాలని రెండు మండలాల ప్రజలు అధికారులను వేడుకుంటే గతేడాది ప్యాచ్‌వర్క్ పనులు ప్రారంభించారు. కంకర వేసి వదిలేశారు. ఇంతవరకు పనులు పూర్తి కాలేదు.

– తిరుమలేష్, అయిజ

ఉన్న రోడ్డును తవ్వేశారు..



ఏడాది క్రితం బీటీ రోడ్డు పైపొరను తవ్వేశారు. మరమ్మతులు చేసేందుకు గుంతల్లో కంకర వేశారు. ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. దాని వల్ల రెండు మండలాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి ప్యాచ్ వర్క్ పనులు పూర్తిచేయాలి. – ఈరన్న, బింగుదొడ్డి

ప్రమాదాలు జరుగుతున్నాయి



రోడ్డుపై శిథిలాలను తొలగించి వాటి స్థానంలో కంకర వేసి వదిలేశారు. కనీసం కంకరపై రోడ్డు రోలర్ కూడా తిప్పలేదు. కంకరపై ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు ప్రతికూలంగా మారింది. వాహనాలు అదుపుతప్పి అనేక సార్లు ప్రమాదాలు జరిగాయి.

– రమేష్, భూంపురం

వైభవంగా స్వామివారి పల్లకీసేవ



స్వామి వారి పల్లకీ సేవ

కేటిదొడ్డి: దీపావళి పండుగ సందర్భంగా శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మండలంలోని వెంకటాపురం గ్రామంలో స్వామి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం స్వామి వారిని ఆలయం నుంచి ఆంజనేయ స్వామి దేవాలయం వరకు పల్లకీలో ఊరేగించారు. ఉత్సవాల సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వస్తున్నారు. భక్తులతో స్వామి ఆలయం కిటకిటలాడుతోంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా దుకాణాల్లో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, వివిధ గ్రామాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

పందులను దూరంగా తరలించాలి



బీచుపల్లిలో ఆలయ ఆవరణలో స్వైరవిహారం చేస్తున్న పందులు

ఎర్రవల్లి: మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో ఆలయ పరిసర ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెంపకందారులు పుణ్యక్షేత్రం సమీపంలోనే షెడ్లను ఏర్పాటు చేసి పందులు పెంచడంతో అవి విచ్చలవిడిగా ఆలయ ఆవరణలో స్వైర విహారం చేస్తున్నాయి. దీనివల్ల పుణ్యక్షేత్రంలోని ఆలయాల ఆవరణలో మురుగు అధికంగా పెరిగి దుర్వాసన వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ఆలయ సమీపంలో పెరుగుతున్న పందులను ఆలయానికి దూరంగా తరలించాలని భక్తులు కోరుతున్నారు.

ఆలయంలో పిరమిడ్‌కు భూమిపూజ



ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ మాస్టర్లు

అయిజ: పట్టణంలోని శివాంజనేయ దేవాలయ ప్రాంగణంలో పిరమిడ్ మాస్టర్లు పిరమిడ్ నిర్మాణం కోసం ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిరమిడ్ మాస్టర్లు ఆంజనేయరెడ్డి, కొండారెడ్డి, సైదయ్య, ప్రభాకర్, రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రోడ్లపై శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిరమిడ్ మాస్టర్లు మాట్లాడారు. పిరమిడ్‌లో ధ్యానం చేయడం వల్ల మూడు రెట్ల శక్తిని అధికంగా పొందవచ్చన్నారు. శాఖాహారం, ధ్యానం ద్వారా నిత్య జీవితంలో ఆరోగ్యంగా, ఆనందంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్లు ఉపేందర్, శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, సర్వ మంగళమ్మ, పరశురాం, రవికుమార్, ప్రభావతి, నీరజ, శివ రాములు, వెంకటేశ్వర్లు, ఉమేష్ గౌడ్, జ్ఞానేశ్వరి, స్వప్న, హనుమన్న పాల్గొన్నారు.

7న పాలమూరులో ధర్మయుద్ధ మహాసభ



బోయలగూడెంలో పాలమూరు సభ గురించి వివరిస్తున్న బల్గెర ఏసన్న

గట్టు: పాలమూరులో 7న నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న, జిల్లా కోకన్వీనర్ బండారి తూం డేవిడ్‌లు విజ్ఞప్తి చేశారు. ఆదివారం చాగదోణ, లింగాపురం, బోయలగూడెం, ఇందువాసి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు పర్యటించారు. పాలమూరులో నిర్వహించే సభకు అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చాగదోణ తిమ్మప్ప, శంకరన్న, కిషోర్, ప్రసాద్, ప్రేమయ్య, డేవిడ్, భాస్కర్, భీమన్న, డానియేలు, శంకరప్ప, భీమేష్, సల్మాన్, నర్సన్న, సురేష్, దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సరుకుల పంపిణీ



అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

కేటిదొడ్డి: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి బీజేపీ నాయకులు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. ఆదివారం బీజేపీ సీనియర్ నాయకులు బల్గెర శివారెడ్డి కేటిదొడ్డి లో ముంత రంగప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదంలో ముంత రంగప్ప గుడిసే పూర్తిగా కాలిపోయిన విషయం తెలిసిందే. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులతో పాటు, ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అనిమిరెడ్డి, భీంరెడ్డి, శ్రీపాదరెడ్డి, వీరేష్, గోవిందు, వీరన్న, కర్రెప్ప, రఘు, తదితరులు పాల్గొన్నారు.

గీతా కార్మికుల సమస్యలు తీర్చాలి

రాజోళి: గీతా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కమిటీలను ఏర్పాటు చేయాలని గౌడ సంఘం మండల ప్రధాన కార్యదర్శి సిద్దయ్య గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. చాలా గ్రామాల్లో సరైన లైసెన్స్‌లు లేక, నాయకుల చేతిలో కల్లు దుకాణాలు నడుస్తున్నాయని, వాటిని నిజమైన గీతా కార్మికులకు అందించాలని కోరారు. నాటిన ఈత చెట్లకు రక్షణ లేకుండా పోతుందని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా గీతా కార్మికులకు ఉపాధి పెరిగే విధంగా మొక్కలు నాటి, జీవనోపాధి కల్పించాలని, కార్మికులకు కావాల్సిన వసతులు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆల్ ఇండియా తైక్వాండో యూనివర్సిటీ పోటీలకు ఎంపిక



సాయిశరత్

గద్వాలటౌన్: ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో నిర్వహించే ఆల్ ఇండియా తైక్వాండో యూనివర్సిటీ పోటీలకు గద్వాలకు చెందిన క్రీడాకారుడు సాయి శరత్ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న సాయిశరత్ ఇటీవల జరిగిన ఎంపిక పోటీల్లో సత్తాచాటారు. ఇండివిజ్యువల్ పూమ్సే విభాగంలో సాయిశరత్ అత్యంత ప్రతిభ చాటి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ క్రీడాకారుడు కొన్నేళ్లుగా తండ్రి కరాటే మాస్టర్ శ్రీహరితో శిక్షణ పొందారు. సాయిశరత్ ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కార్తీకమాస ప్రత్యేక పూజలు



మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో ఆదివారం మహిళలు కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయాలకు చేరుకుని అభిషేకాలు నిర్వహించి కార్తీకదీపాలను వెలిగించారు. భక్తులు అధికసంఖ్యలో కార్తీకపూజల్లో పాల్గొంటున్నట్లు అర్చకులు రమేషాచారి, రవిచారి, ధర్మేంద్ర, విజయ్, పరమేశ్వరాచారిలు తెలిపారు.

నేడు అమరచింతలో బొడ్రాయి పూజలు

అమరచింత: పట్టణంలో బొడ్రాలను స్థాపించి ఏడాది పూర్తికావడంతో వార్షిక పూజలు సోమవారం నిర్వహిస్తున్నట్లు బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని 10 వార్డులలో ప్రతిష్ఠ చేసిన బొడ్రాల వద్ద పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శివచౌడేశ్వరి ఆలయం వద్ద నాభిశిలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

‘మొసలి ఉంది జాగ్రత్త’

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట గ్రామ శివారులోని రైకంటలమ్మ గుడి సమీపంలోని వాగులో పెద్ద మొసలి కనిపించినట్టు గ్రామస్తులు తెలిపారు. మొసలి ఉన్నందున గొర్రెల కాపరులు, చేపల వేటకు వెళ్లే వారు కుంట దగ్గరకు వెళ్లవద్దని సూచించారు. వాగులో కనిపిస్తున్న మొసలిని చూసి ఆటుగా పొలాలకు వెళ్లే రైతులు, పశువుల, గొర్రెల కాపరులు, మత్స్యకారులు భయపడుతున్నారని, అటవీశాఖ అధికారులు స్పందించి వాగులో ఉన్న మొసలిని తీసుకెళ్లాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



సీసీఐ పత్తి కొనుగోలుకు సిద్ధమవుతున్న కాటన్ మిల్లు

అలంపూర్: రైతులకు మద్దతు ధర కల్పించడానికి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ దొడ్డెన్న, కార్యదర్శి ఎల్లస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని వరసిద్ధి వినాయక కాటన్ మిల్లులో కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పత్తికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7521, రూ. 7121గా ఉంటుందని పేర్కొన్నారు. సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించుకోవడానికి ప్రతి రోజు 40 మందికి టోకెన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. పత్తి విక్రయించాల్సిన రైతులు రైతు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించి కనీస మద్దతు ధర పొందాలని కోరారు.

చదివిన పాఠశాలకే ప్రధానోపాధ్యాయుడు



గుడుదొడ్డి పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఆలీబాబా

అయిజ: విద్యార్థిగా తాను చదువుకున్న పాఠశాలకే మళ్లీ ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడిగా వెళ్లిన అరుదైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని జడదొడ్డి గ్రామానికి చెందిన సుల్తాన్, సకినాబీ దంపతుల కుమారుడు ఆలీబాబా 1 నుంచి 5వ తరగతి వరకు సొంతగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. 6వ తరగతి నుంచి 7వ తరగతి నుంచి వారి గ్రామానికి కి.మీ. దూరంలో ఉన్న గుడిదొడ్డి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి చదువుకున్నాడు. డిగ్రీ పూర్తి చేసి గుడిదొడ్డిలో సింగిల్ టీచర్ ఉన్న సమయంలో మూడేళ్ల పారితోషకం తీసుకోకుండా విద్యార్థులకు పాఠాలు బోధించాడు. 2024 డీఎస్సీ నోటిఫికేషన్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం సాధించాడు. జడదొడ్డి గ్రామంలో ఇప్పటి వరకు ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం సాధించిన ఏకైక వ్యక్తిగా నిలిచాడు. గుడిదొడ్డి గ్రామంలో తాను చదివిన ప్రభుత్వ పాఠశాలకే మళ్లీ తానే ప్రధానోపాధ్యాయుడిగా వెళ్లడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆలీబాబా పేర్కొన్నాడు. ఆలీబాబాను చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం



విద్యుత్ వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏడీఈ గోవిందు

అయిజ: విద్యుత్ వినియోగదారుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తామని ఏడీఈ నీలి గోవిందు అన్నారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ఏడీఈ కార్యాలయ ఆవరణలో అధికారులు విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. సబ్ డివిజన్ పరిధిలోని అయిజ, గట్టు, మల్దకల్, రాజోళి మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు సదస్సుకు హాజరై వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. వివిధ మండలాల ఏఈలు నరేందర్‌రెడ్డి, చెన్నయ్య, సందీప్, సబ్ ఇంజనీర్ శోభిత, సిబ్బంది, వివిధ మండలాల ప్రజలు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



గోవిందహళ్లిలో విద్యార్థులతో సీనియర్ కరాటే మాస్టర్లు

మదనాపురం: మండలంలోని గోవిందహళ్లి(అగ్రహారం)లో తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్టు సీనియర్ కరాటే మాస్టర్లు పెంటన్నయాదవ్, నరేందర్‌సాగర్‌లు తెలిపారు. ఈ పోటీల్లో దాదాపు 50మంది విద్యార్థులు పాల్గొనగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణ కోసం ఉపయోగ పడుతుందని, ముఖ్యంగా బాలికలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ కూతుళ్లకు కరాటే నేర్పించి వారి ధైర్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, గ్రామస్తులు రాములు, హర్షవర్ధన్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేష్, చందు, శాంతయ్య, రమేష్‌లతో పాటు కరాటే శిక్షకులు రవి, శివశంకర్, పరశురాం, తదితరులు ఉన్నారు.

అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో బిక్ష చేస్తున్న అయ్యప్ప స్వాములు

- కార్తిక మాసంలో నిత్యాన్నదానం
- ప్రతిరోజు వందలాది మంది స్వాములకు అన్నదానం



అయ్యప్ప ఆలయ నిర్మాణం కొరకు విరాళం అందజేస్తున్న ధన్వాడ వెంకటేష్.

కొత్తకోట రూరల్: అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణ శివారులోని అయ్యప్ప అన్నదాన క్షేత్రంలో అయ్యప్ప సేవాసమితి వ్యవస్థాపకులు గోపాలకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా అయ్యప్పసేవాసమితి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది కార్తికమాసంలో మాల ధరించే అయ్యప్పస్వాముల కోసం జనవరి 14వరకు నిత్య అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్షేత్రం జాతీయ రహదారి 44 పక్కన ఉండటం వల్ల అయ్యప్ప స్వాములతో పాటు ఉత్తర తెలంగాణ ప్రాంతం నుంచి శబరిమలకు పాదయాత్ర వెళ్లే స్వాములు, వాహనాల్లో వెళ్లే అయ్యప్ప స్వాములకు, తిరుగు ప్రయాణంలో స్వస్థలాలకు వెళ్లే వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు దాదాపు 300 నుంచి 500 వరకు అయ్యప్పస్వాములు ఈ క్షేత్రంలో అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. దాతల సహకారంతో గత కొన్నేళ్లుగా అయ్యప్ప మాలాధారణ చేసిన స్వాములకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

విరాళం అందజేత..

పట్టణ సమీపంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న అయ్యప్పస్వామి గుడి నిర్మాణానికి వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన గురుస్వామి ధన్వాడ వెంకటేష్ తన వంతు సహాయంగా రూ.1.50లక్షలు విరాళంగా అయ్యప్ప సేవాసమితి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు దూపం నాగరాజు, ప్రధాన అర్చకులు నాటరాజ్, కమిటీ సభ్యులు లింగేశ్వర్, పి.అనిల్‌కుమార్, భీమ కిషోర్‌కుమార్, విశ్వనాథం గంగాధర్‌శెట్టి, వేముల సుధాకర్‌రెడ్డి, సత్యంసాగర్, కల్యాణ్, భాస్కర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, కవిందర్ రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆకుల శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సతీష్‌కుమార్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లి: మండలంలోని పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన మంద పెద్ద బుచ్చన్న అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్. కిశోర్ పరామర్శించారు. ఆయనతో పాటు వెంకట్రాముడు, వెంకటేష్, పురుషోత్తం, భాస్కర్ తదితరులు ఉన్నారు.